## వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం

మంచిర్యాలటౌన్, మే 27 : విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్ బాట్ ద్వారా కూడా తమ సమస్యలు తెలియజేసి, పరిష్కరించుకోవచ్చని ఆ శాఖ మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ వీ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ముదుగా వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సాప్‌లో 79016 28348 నంబర్‌కు 'హాయ్' అని చాట్ చేయగానే 'హాయ్ టీజీ ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం' అనే మెస్సేజ్ వస్తుందని పేర్కొన్నారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని ఉంటుందని తెలిపారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, వితౌట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ వస్తుందని, ఇలా విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేయగానే వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ వివరాలు డిస్ప్లే అవుతాయని వెల్లడించారు. ఇలా వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్‌కు సంబంధించిన వివిధ రకాలు మెనూలో కనబడుతాయని తెలిపారు. అందులో కంప్లైంట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుందని, ఇలా ఏజెంట్‌తో చాట్ గానీ, కంప్లైంట్ గానీ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కంప్లైంట్ ఐడీతో ఒక నంబర్ జనరేట్ అయ్యి ఫిర్యాదు నమోదు చేయబడుతుందని వెల్లడించారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారికి నివేదించబడుతుందని, ఈ విషయం వినియోగదారుడికి మెస్సేజ్ వెళ్తుందని తెలిపారు. అలా భవిష్యత్‌లో కంప్లైంట్ ఐడీతో వినియోగదారుడి సమస్యను ట్రాక్ చేసుకోవచ్చని చెప్పారు. కంప్లైంట్ పూర్తి అయ్యిన తర్వాత వినియోగదారుడికి సమాచారంతో పాటు, ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుందని, అలాగే సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని అడుగుతుందని, సంతృప్తి చెందకపోతే మళ్లీ కంప్లైంట్ రీఓపెన్ చేయాలని అడుగుతుందని వెల్లడించారు. అలాగే www .tgnpdcl.com వెబ్ సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపిస్తుందని, క్లిక్ చేసుకొని చాట్ చేయవచ్చని తెలిపారు. దీంతోపాటు, టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి కూడా సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

## మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

బెల్లంపల్లి, మే 27: మంచిర్యాలలో ఈ నెల 25న జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కోచ్ సంతోష్ తెలిపారు. ఎం హన్సిత్, శ్రీనైన్, జీ లాహిత వర్మ, ఐ చాణక్య, కే ఈషాన్ వర్మ, ఏ చిన్మయి చైత్రిక, ఏ అక్షయ, ఎం పార్థు, బీ కార్తికేయ, వీ సుహాన్, ఎండీ సానియా, ఎండీ గౌసుద్దీన్, టీ మనో రిత్విక్, డీ దీక్షిత్, బీ లక్ష్మీసహస్ర మొత్తం 24 మంది పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొనారు. తిలక్‌స్టేడియంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వారిని అభినందించారు. క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. క్రీడలతో క్రీడాకారులకు స్నేహభావం పెరుగుతుందని తెలిపారు.

## అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు


అథ్లెటిక్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనా రెడ్డి

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. అండర్-8, 10, 12 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ తెలిపారు. ప్రతిభ చూపిన 20 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జూన్ 1న జరుగనున్న 11వ తెలంగాణ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి గుండం లక్ష్మణ్, కోచ్ విద్యాసాగర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి, సోమగూడెం జాతీయ రహదారి మధ్యలోని వాగును మూసి వేసి నిర్మించిన గోడలు

# వాగు మాయం..!

## బెల్లంపల్లి, సోమగూడెం నేషనల్ హైవే మధ్య వాగుపై అక్రమార్కుల కన్ను

- బ్రిడ్జి కింద నీరు రాకుండా చేసి కబ్జా
- ఎగువ నుంచి నీరు రాకుండా మట్టి పోసి, గోడల నిర్మాణం
- నీరు వెళ్లేందుకు దారిలేక ఏర్పడిన మడుగు
- వరద వస్తే ప్రమాదమే!
- పునర్నిర్మించాలని కోరుతున్న స్థానికులు

కాసిపేట, మే 27 : బెల్లంపల్లి, సోమగూడెం నేషనల్ హైవే మధ్యలో కల్వరీ చర్చి సమీపంలో గల వాగును కబ్జాదారులు మాయం చేస్తున్నారు. జాతీ రహదారి మధ్య బ్రిడ్జి నుంచి వెళ్లే వాగును పూర్తిగా మూసివేశారు. అడ్డుకట్ట వేసి, గోడలు కట్టి, కనుమరుగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రహదారి మధ్యలో వాగు ఉండగా, దానిపై గతంలోనే బ్రిడ్జి నిర్మించారు. నేషనల్ హైవే కూడా కావడంతో నిర్మాణాన్ని విస్తరించి, పెద్ద బ్రిడ్జి కూడా నిర్మించారు. కింది నుంచి నీరు పారుతూ బయటకు వెళ్లేది. రోడ్డును ఆనుకొని ఉన్న భూముల ధరలు అధికంగా పెరగడంతో కొందరు కబ్జాదారులు వాగుపై కన్నేసారు. భూముల మధ్య వాగు ఉంటే ఇబ్బందవుతుందని గ్రహించి, కొద్దికొద్దిగా విస్తీర్ణాన్ని చిన్నగా చేశారు. నీరు పారే ప్రాంతాన్ని మొత్తం కబ్జా చేశారు. వాగు ఎగువ ప్రాంతంలో ఎత్తుగా మట్టి నింపి నీరు రాకుండా మూసి వేసి, గోడలు నిర్మించారు. అయితే దీని వల్ల వరద వస్తే వెళ్లేందుకు దారిలేక రోడ్డ పైకి చేరే ప్రమాదం ఉంది. ప్రస్తుతం బ్రిడ్జి కిందనే నీరు నిలిచి మడుగులా తయారైంది. దీంతో పాటు నీరు నిలిస్తే పైన ఉన్న ప్రాంతాల్లో సైతం నీరు నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇక్కడి వాగులో ఎక్కువ శాతం వరద పారుతుందని స్థానికులు అంటున్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి, వాగును పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ నరేన్ కుమార్‌ను వివరణ కోరగా.. సహజ సిద్ధమైన నాలాకు ఆనుకొని కట్టడాలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై నోటీసులు ఇస్తామని వెల్లడించారు.

## బాధితులకు అండగా భరోసా సెంటర్

- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్
- బాధితులకు రూ.35 వేల చెక్కులు అందజేత


మాట్లాడుతున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాల అర్బన్, మే 27 : బాధిత మహిళలు, పిల్లలకు అండగా భరోసా సెంటర్ సేవలు అందిస్తున్నట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో మంగళవారం భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ లైంగికదాడికి గురైన మహిళలు, బాలికలకు అండగా భరోసా సిబ్బంది పనిచేస్తారన్నారు. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్‌ను ఇద్దరు బాధిత మహిళలకు వైద్యపరంగా రూ.10వేలు, ఎడ్యుకేషన్ సపోర్టు పరంగా ఒక్కరికి రూ.5వేలు, సెల్ఫ్ బిజినెస్ కింద ఇద్దరికి రూ.20 వేల చెక్కులను అందజేసినట్లు వెల్లడించారు. ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ కుమార్, షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి, భరోసా కోఆర్డినేటర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం


2007-08 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు.

దండేపల్లి (జన్నారం), మే 27 : దండేపల్లి మండలం మురిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ ఒక్కచోట చేరింది. చదువు ముగించుకొని భవిష్యత్‌ను వెతుక్కుంటూ వెళ్లిన ఈ విద్యార్థి బృందం.. 17 ఏండ్ల తర్వాత అ'పూర్వ' సమ్మేళనం ద్వారా మంగళవారం ఆప్యాయంగా కలుసుకున్నది. అందుకు అదే పాఠశాల వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సందడితో రోజంతా ఉత్సాహ భరిత వాతావరణం నెలకొన్నది. అందుబాటులో ఉన్నవారంతా కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.238 కోట్లు జమ

నస్పూర్, మే 27 : మంచిర్యాల జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.238.13 కోట్లు జమ చేసినట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 320 కేంద్రాల ద్వారా 23,348 మంది రైతుల వద్ద నుంచి 1,62,870 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్యాలు పూర్తిచేసిన 131 కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PASSPORT LOST
నేను మూజీబుర్ రహెమాన్ తండ్రి ఉబెదూర్ రహెమాన్, ని|| ఇ.నెం.7-15, మోమిన్‌పుర, ఉట్నూర్ గ్రామము, ఉట్నూర్ మండలం, జి|| ఆదిలాబాద్. తెలంగాణ, నా యొక్క పాస్‌పోర్ట్ నెం.N4815954 తేది: 02.05.2025 రోజున ఉట్నూర్ నుండి ఆదిలాబాద్‌కు బస్సులో ప్రయాణిస్తుండగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు సంప్రదించవలసిన ఫోన్ నెం. 94418 69338

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ


ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి సురేఖ

వేమనపల్లి, మే 27 : వేమనపల్లి మండలం గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాల్లో గల ఫర్టిలైజర్ దుకాణాల్లో మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకురాలు సురేఖ తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాకు నిల్వలు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలుంటాయని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు అందించాలన్నారు. అనంతరం నీల్వాయి రైతు వేదికలో రైతులతో మాట్లాడారు. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేసుకోవాలని, పంట మార్పిడిని పాటించాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## పులిమడుగు జీపీ సందర్శన

రామకృష్ణాపూర్, మే 27 : మొబైల్ యాప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మంగళవారం పులిమడుగు గ్రామ పంచాయతీని మందమర్రి మండల పంచాయతీ అధికారి ఎం సత్యనారాయణ సందర్శించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని కార్యదర్శి సురేశ్‌కు సూచించారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వాటర్ అండ్ శానిటేషన్‌కు సంబంధించిన 7 రిజిష్టర్లను పరిశీలించారు. నర్సరీలను పరిశీలించి, మొక్కలు 100 శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కన్నెపల్లి, మే 27 : ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని యోగా ట్రైనర్ పందిర్ల రజిత పేర్కొన్నారు. కన్నెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం యోగాసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజూ యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. యోగా, ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.


యోగాసనాలు వేయిస్తున్న రజిత

## ఐకే ఓసీ సందర్శన


ఐకే ఓసీపీపై పని ప్రదేశాలను పరిశీలిస్తున్న జీఎం సేఫ్టీ కార్పొరేట్

జైపూర్, మే 27 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని మంగళవారం కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఎస్ఆర్పీ జీఎం ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ మేనేజర్ రఘుకుమార్ సందర్శించారు. వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో పని స్థలాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వార్షిక సంవత్సరం సాధించాల్సిన లక్ష్యాలకు సంబంధించిన అంశాలను దిశా నిర్దేశం చేశారు. రక్షణే ప్రథమం, రక్షణే ఎల్లప్పుడు, రక్షణే చివరి వరకు అనే నినాదంతో ముందుకెళ్లాలని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడే సంస్థ లాభాలు గడిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఉత్పత్తికి సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, ఆపరేషన్స్ మేనేజర్ శంకర్, ప్రాజెక్టు ఇంజినీర్ రామకృష్ణారావు, రక్షణ అధికారి సతీశ్ పాల్గొన్నారు.

## క్రీడలతో పాటు చదువులో రాణించాలి

కౌటాల,మే 27 : యువకులు క్రీడలతోపాటు, చదువులోనూ రాణించాలని ఆదివాసీ కొలావార్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య సూచించారు. కుంబారి గ్రామంలో మంగళవారం గ్రామ యువకులు నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిగా హరి హంటర్ రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా వెంకీ వారియర్స్‌కు రూ.5 వేలను ఆదివాసీ కొలావార్ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోల్ల బాపు, జిల్లా ఉపాధ్యక్షుడు దడ్డి చిలుకయ్య, జిల్లా కార్యదర్శి టేకం సురేశ్, మండలాధ్యక్షుడు ఆత్రం సత్తయ్య, మండల కమిటీ, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

బెల్లంపల్లి, మే 24 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కాసిపేట గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఉటూరి సంతోష్‌కుమార్ తెలిపారు. గురుకుల పాఠశాలలో 2017 నుంచి ఇప్పటి వరకు పది, ఇంటర్, డిగ్రీ చదివి ఉన్నత చదువునభ్యసించలేని నిరుద్యోయగులకు ఉపాధి నైపుణ్యాలు పెంచుకునే లక్ష్యంతో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

## ఆర్థికపరమైన పనులు చేపట్టలేం


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

దహెగాం, మే 27 : గ్రామ పంచాయతీల్లో బుధవారం నుంచి ఆర్థికపరమైన పనులు చేపట్టబోమని మండలంలోని గ్రామాల కార్యదర్శులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో ఆల్బర్ట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 15 నెలలుగా నిధులు రావడంలేదన్నారు. ఇప్పటి వరకు సొంత డబ్బు ఖర్చు చేసి, పంచాయతీల్లో అత్యవసరమున్న పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఆర్థిక భారం పెరిగిందని, ఆ ప్రభావం తమ కుటుంబాలపై పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు చౌదరి సురేశ్, కార్యదర్శులు ప్రణిత్‌బాబు, వంశీకృష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

- వాంకిడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్

వాంకిడి, మే 27 : పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దూరమవుతాయని మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ అన్నారు. వాంకిడి మండలం గణేశ్‌పూర్ గ్రామంలో మంగళవారం వ్యక్తిగత పరిశుభ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. 43 మందికి పరీక్షలు చేసి, నలుగురి నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు, ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విద్యశ్రీ, హెల్త్ అసిస్టెట్ భగవాన్‌దాస్, సునంద, ఆశ కార్యకర్త తదితరులున్నారు.

## విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

దండేపల్లి, మే 27 : రైతులు చట్ట వ్యతిరేకంగా పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవని ఎస్ఐ తహసినుద్దీన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ యజమానులు, రైతులు పంట పొలాల చుట్టు విద్యుత్ తీగలు అమర్చడం వల్ల మూగజీవాలు, మనుషులు షాక్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రమాబాయికి ఘన నివాళి

వాంకిడి, మే 27 : మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో మంగళవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంబేద్కర్ అడుగు జాడల్లో రమాదేవి నడిచారని, ఆయన చేసే పనులకు తనవంతు సాయం చేశారని కొనియాడారు.

## స్నూకర్ నిర్వాహకులపై కేసు

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకపూర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సమీపంలో అక్రమంగా స్నూకర్, బెట్టింగ్ నిర్వహిస్తున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవీందర్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాల సిద్ధార్థ నిర్వహిస్తున్న స్నూకర్ వద్ద టౌటా సాయి భాగ్యరాజ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి రూ.1800, స్నూకర్ స్టిక్కులు 20, స్నూకర్ బంతులు 44 స్వాధీనం చేసుకున్నారు. సాయి భాగ్యరాజ్‌ను విచారించగా, తాను ముత్యాల సిద్ధార్థ నిర్వహిస్తున్న స్నూకర్ పాయింట్ వద్ద మణివర్మ, గుడ్డుతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపాడు. ఘటనా స్థలం నుంచి పారిపోయిన అమీర్, అవద్ అలియాస్ అప్సర్‌తో పాటు, మరికొంత మందితో బెట్టింగ్ ఆటల్లో పాల్గొన్నట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

బెల్లంపల్లి, మే 27 : టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి అంబేద్కర్ రడగంబాల బస్తీ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయగా, కుజులు పృథ్వి, అసంపెల్లి మహేశ్, జాడి అశోక్, దుర్గం మహేశ్ పట్టుబడగా, భూమయ్య తప్పించుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. వీరి నుంచి రూ.3,050, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డ్ సంపత్ ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సీసీసీ నస్పూర్, మే 27 : నస్పూర్ పట్టణంలోని ఫ్లడ్‌కాలనీలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీసీసీ నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు. ట్రాక్టర్ యజమాని యాదగిరి రామకృష్ణ తన డ్రైవర్ శ్రీపతి రాజేశ్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక తీసుకెళ్లాలని, అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

## ప్రయాణికురాలి డబ్బు దొంగతనం

రెబ్బెన, మే 27 : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు దొంగతనం చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి మహిళ మంగళవారం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వరకు వచ్చింది. అక్కడి న ఉంచి మంచిర్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. కండక్టర్‌కు ఆధార్‌కార్డు చూపేందుకు బ్యాగు తెరువగా, అందులోని రూ.15 వేలు కనిపించకపోవడంతో కండక్టర్‌తో పాటు డ్రైవర్‌కు తెలిపింది. దీంతో రెబ్బెన మండలం దేవులగూడ వద్ద బస్సును నిలిపి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేయగా, ఎవరి వద్ద డబ్బు లభించలేదు. ఈ విషయమై, రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా బస్సులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ నుంచి డబ్బు పోయిందన్న సమాచారంతో తమ సిబ్బంది వెళ్లి బస్సులోని ప్రయాణికులందరినీ తనిఖీ చేశారని తెలిపారు. అయినా డబ్బు లభించలేదని పేర్కొన్నారు. బాధితురాలు డబ్బు పోయిన విషయంలో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## అటవీ శాఖ అధికారులపై ఫిర్యాదు

వేమనపల్లి, మే 27 : చామనపల్లి రైతులను భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని పేర్కొంటూ మండలంలోని అటవీశాఖ అధికారులపై సోమవారం రాత్రి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ.. చామనపల్లి గ్రామంలోని నిరుపేద రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నా వారిని భూముల్లోకి రానివ్వకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. అటవీ శాఖ భూములు అని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. 9 మంది దళిత రైతులపై అక్రమంగా కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నాయకులు మున్నారాజా సిసోడియా, దుర్గం ఎల్లయ్య, లింగయ్య, బానయ్య, మధూకర్, పర్వతాలు, సతీశ్, కృష్ణ, మల్లయ్య, రాజయ్య పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా బాక్సింగ్ కమిటీ

సీసీసీ నస్పూర్, మే 27 : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా నస్పూర్ పట్టణానికి చెందిన డాక్టర్ రాజు ఆరుముళ్ల, ప్రధాన కార్యదర్శిగా కొట్టె దేవేందర్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. వీరు 2025-29 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్‌కు బాధ్యతలు నిర్వహించనున్నారు. నియామక పత్రాలు అందకున్న అనంతరం వారు మాట్లాడుతూ.. బాక్సింగ్ అభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి కృష్ణ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మందమర్రి, మే 27 : మందమర్రి మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ సతీశ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. మందమర్రి మున్సిపాలిటీలో నిర్మాణాలు జరుగుతుండగా, అందుగులపేట గ్రామ పంచాయతీలో అనుమతులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎస్పీ పట్టణాధ్యక్షుడు గాజుల శంకర్, మండలాధ్యక్షుడు ఎండీ మతీన్ ఖాన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందమర్రి రూరల్, మే 27 : మండలంలోని పాలచెట్టు 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని క్యాతనపల్లి ఏఈ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్‌పల్లి, సండ్రోన్‌పల్లి, పొన్నారం, వెంకటాపూర్, దుబ్బపల్లి, సారంగపల్లి, చిర్రకుంట, ఆదిల్‌పేట తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జైనూర్ మే 27 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. ఫర్టిలైజర్ వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు సూచించారు. డైరెక్టర్లు లోకెనర్దర్ షేకు, లింగు, మాజీ సర్పంచ్‌లు, ఆదివాసీ నాయకులు శంకర్, అమృత్, దత్తు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఫెరోజ్ ఖాన్, నాయకులు కొట్నాక దౌలత్ రావ్, హైదర్ తదితరులున్నారు.